

దరఖాస్తుల ఆహ్వానం

తపాలాశాఖలో డైరెక్ట్ ఏజెన్సీలకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ అధికారి వసంత తెలిపారు. - 10లో



పెంచలకోనకు భారీ ఆదాయం

పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల ద్వారా భారీ ఆదాయం వచ్చినట్లు డీసీ విజయసాగర్ తెలిపారు. - 10లో



శ్రీవారి సేవలో ప్రముఖులు

కలియుగదైవం తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని పలువురు ఏపీ మంత్రులు, పలువురు ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. - 10లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే బియ్యపు మధుకు మంత్రి ఆశీర్వాదం



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రేణిగుంట: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం రాత్రి తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసానికి ఎమ్మెల్యే చేరుకుని ఆయన దీవెనలు అందించాలని కోరారు. దీంతో మంత్రి ఆయనకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తిరుమలరెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 75,783 మంది స్వామివారిని దర్శించుకోగా 35,665 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.08 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

ప్రిస్కిల్లాకు బంగారు పతకం



ప్రిస్కిల్లా

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని చర్చి కాంపౌండ్‌కు చెందిన స్వర్గీయ పాస్టర్ మంగళపూరు మనోహర్ కుమార్తె మంగళపూరు ప్రిస్కిల్లా ఎమ్మెస్సీ బయోటెక్నాలజీలో బంగారు పతకం సాధించినట్లు విక్రమ సింహపురి యూనివర్సిటీ బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో ప్రకటించింది. నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో 8, 9 కన్వెన్షన్లకు సంబంధించి వివిధ విభాగాల్లో 2021–2022 విద్యా సంవత్సరాల్లో 16 మంది గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థుల జాబితా విడుదలైంది. అందులో 2021కి చెందిన బ్యాచ్‌లో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన టాపర్‌గా ప్రిస్కిల్లా నిలిచింది. దీంతో ఆమెకు యూనివర్సిటీలో ఈ నెల 22న జరిగే కాన్వొకేషన్‌లో ఏపీ గవర్నర్ చేతుల మీదుగా శ్రీ ప్రతాప్ భీమిరెడ్డి ఫౌండేషన్ బంగారు పతకం అందుకోనుంది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ హాల్ టికెట్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 15వ తేదీ నుంచి హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను సంబంధిత పాఠశాల నుంచైనా లేదా www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని నమోదు చేసి హాల్ టికెట్లను పొందవచ్చని డీఈఓ తెలిపారు.

భక్తులతో కాణిపాకం కిటకిట

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు, ఎన్నికలు ముగియడంతో ఆలయానికి భక్తుల తాకిడి మరింత పెరిగింది. ఆలయ క్యూలో భక్తులు బారులు తీరారు. అధికారులు భక్తులు అసౌకర్యానికి గురికాకుండా పర్యవేక్షించారు. స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు.

రూ.23.14 లక్షల రికవరీకి నివేదిక

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లాలోని 8 డివిజన్ల పరంగా ఈ ఏడాది జనవరి–మార్చి వరకు వినియోగదారులకు జరిగిన సేవాలోపానికి గాను రూ.23,14,550 మొత్తాన్ని దాదాపు వందమంది ఏఈల జీతాల నుంచి రికవరీ చేయాలని ఏపీఈఆర్సీకి ఆ శాఖ జిల్లా అధికారులు బుధవారం నివేదిక పంపారు. ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) పాటించలేదని, అందుకే ఈ మొత్తాన్ని వారి జీతాల నుంచి కట్ చేయాలని నివేదించారు. ఈ నిబంధనల ప్రకారం ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, రిలీజ్ ఆఫ్ న్యూ సర్వీస్, పనుల కోసం అంచనా– అని మూడు విభాగాల పరంగా మొత్తం 2,341 ఫిర్యాదుదారులు పరిహారానికి అర్హులని వివరించారు.



ప్రత్యేక అలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ

భక్తుల కొంగుబంగారంగా, సాక్షాత్తు కలియుగ వైకుంఠుడైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి స్వయాన చెల్లెలు, శక్తి స్వరూపిణి అయిన శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి రోజు బైరాగి వేషధారులతో పట్టణంలో సందడి నెలకొంది. ఐదు రోజుల పాటు భక్తులు ఒక్కో రోజు ఒక్కో వేషధారణలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. గంగజాతరను ఈ ప్రభుత్వం రాష్ట్రస్థాయి పండుగగా గుర్తించిన నేపథ్యంలో మరింత శోభాయమానంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు జరగనున్నాయి.

వేషాల వేడుక

- ప్రారంభమైన తిరుపతి గంగజాతర
- తొలిరోజు బైరాగి వేషంతో భక్తుల సందడి

తిరుపతి కల్చరల్ : భక్తుల కొంగుబంగారమైన తాతయ్యగుంట గంగమ్మ జాతర తొలి రోజు బుధవారం భక్తుల బైరాగి వేషాలతో హోరెత్తింది. చిన్న, పెద్దా అనే తేడా లేకుండా శరీరమంతా విభూది రాసుకుని నల్లటి బొట్లు పెట్టుకుని మెడ, కాళ్లు చేతులకు రేల కాయల గజ్జలు కట్టుకుని నడుముకు వేపాకు కట్టి చేతుల్లో వేపాకు కొమ్మలను పట్టుకుని నగరంలో కేరింతలు కొడుతూ విహరించారు. అనంతరం వేషాలమ్మ, తాళ్లపాక పెద్ద గంగమ్మలను దర్శించుకుని తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకుని ప్రదక్షిణ చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. కొందరు వెయ్యి కళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. బుధవారం ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలో కొలువుతీర్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతరలో నేడు బండవేషం..

తిరుపతి గంగజాతర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం నాడు భక్తులు బండవేషంలో అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. జాతర సంప్రదాయం ప్రకారం కైకాల వారు బండోళ్ల చిన్నది(స్త్రీవేషం), చాకలివారు బండోడు(పురుష వేషం) వేస్తారు. అలాగే స్థానికుల పిల్లలు, పెద్దలు బండవేషాలు వేస్తారు. ఎర్రటి కుంకుమ ఒళ్లంతా పూసుకుని బొట్లు పెట్టుకుని బొరుగుల దండలు, బండపూల దండలను మెడకు, చేతికి కట్టుకుని రోకలి, కర్ర చేతపట్టి లయబద్ధంగా శబ్దం చేస్తూ బూతులు తిడుతూ పురవీధుల్లో విహరిస్తారు.



బైరాగి వేషధారణలో చిన్నారులు



ఆకట్టుకున్న చిన్నారులు



తిరుపతి గంగమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

జాతరను ఘనంగా జరుపుకుందాం

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపు
- గంగమ్మ విగ్రహాల ఆవిష్కరణ

అత్యంత ప్రాచీనమైన, భక్త కోటి పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర వేడుకల్లో అందరూ భాగస్వాములై ఘనంగా జరుపుకుందాం తరలిరండి అంటూ టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుపతి ప్రజలకు పిలుపునిచ్చారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానికంగా 15 మండపాల్లో గంగమ్మ తల్లి విగ్రహాలను ఎమ్మెల్యే భూమన ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. తొలుత లక్ష్మీపురం సర్కిల్‌లో, లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను భూమన ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో గంగమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయన్నారు. సాక్షాత్తు తిరుమల నుంచి, అనంతాళ్వార్ల అమృత హస్తాలతో పునర్నిర్మితమైన ఆలయం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయమన్నారు. సాక్షాత్తు కలియుగ వైకుంఠుడైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి స్వయాన చెల్లెలుగా జాతర సందర్భంగా శ్రీవారి సారెను అందుకుంటున్న శక్తి స్వరూపిణి శ్రీతాతయ్యగుంట గంగమ్మ అని తెలిపారు. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి అంతా కలిసి గంగమ్మ జాతరను గొప్పగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు, ఎస్‌కే.బాబు, కోటూరి అంజనేయులు, నాయకులు హరినాథ్, కిరణ్ రాయల్, రాము రాయల్, జానీ, శశి, లక్ష్మీపతి, రాజారెడ్డి, వెంకటేశులు, రవిచంద్రారెడ్డి, ఆవుల మునిరెడ్డి, సుబ్రమణ్యం, కన్నయ్య, అశోక్, కళ్యాణి, ప్రమీల, రాజేష్, స్థానికులు పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి



క్యూలో నిలబడిన మహిళా ఓటర్లు

ఆమే.. కీలకం

ఎన్ని పనులు ఉన్నా పక్కన పెట్టేశారు. ఏది ఏమైనా, సమయం ఎంతైనా సరే ఓటు వేసే వెళ్తామని డిసైడ్ అయ్యారు. దీంతో ప్రతి నియోజకవర్గంలోనూ పురుషులతో పోలిస్తే మహిళల ప్రభంజనమే కనిపించింది. సార్వత్రిక ఎన్నికల్లో నిర్ణయాత్మకశక్తిగా మహిళా ఓటింగ్ మారింది. సంక్షేమ పథకాలే పోలింగ్ కేంద్రాల వైపు వారిని అడుగులు వేయించాయని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. దీంతో జిల్లాలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో భారీ ఎత్తున ఓటింగ్ శాతం పెరిగింది.

- తిరుపతి జిల్లాలో పురుషుల కంటే 27,103 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న మహిళా ఓటర్లు
- ఓటింగ్‌లో వెలుగెత్తిన మహిళా లోకం
- గత ఎన్నికలతో పోల్చితే ఈసారి 1.30 శాతం ఎక్కువ
- అసెంబ్లీ సెగ్మెంట్లకు 78.63 శాతం, పార్లమెంట్ సెగ్మెంట్‌లలో 79.10 శాతం ఓటింగ్ నమోదు
- నిర్ణయాత్మక శక్తిగా మారిన నారీమణులు
- సంక్షేమ పథకాల వల్లే పెరిగిన ఓటింగ్
- ఇదే అధికార పక్షం విజయానికి నాంది అంటున్న విశ్లేషకులు

తిరుపతి అర్బన్: తిరుపతి ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. గతంతో పోలిస్తే ఈసారి ఓటింగ్ శాతం ఎక్కువగానే నమోదైంది. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావించిన రాజకీయ పార్టీలు ఓటర్లను పోలింగ్ కేంద్రానికి వచ్చేలా ప్రోత్సహించాయి. ఓటు విలువను తెలుపుతూ ఎన్నికల కమిషన్ నిర్వహించిన ప్రచారం కూడా పోలింగ్ పెరిగేందుకు దోహదపడిందని అంతా చర్చించుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో తిరుపతి జిల్లా అసెంబ్లీ సెగ్మెంట్లలో 78.02 శాతం పోల్ కాగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం 78.63 శాతం ఓటింగ్ నమోదైంది. దీంతో 0.61 శాతం ఓటింగ్ పెరిగింది. జిల్లాలో అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి పురుషుల కన్నా స్త్రీలే 27,193 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పార్లమెంట్ సెగ్మెంట్‌కు 79.10 శాతం ఓట్లు పోల్ కాగా, పురుషుల కన్నా స్త్రీలు 17,755 మంది ఎక్కువ ఓటేశారు. దీంతో అతివలే రాష్ట్రంలో మరోసారి చరిత్ర సృష్టించడంలో కీలకంగా మారనున్నారన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సాయంత్రం 4 గంటల సమయంలో సింహభాగం మహిళలు పోలింగ్ కేంద్రాలకు పరుగులు తీశారు.

అసెంబ్లీ	పురుషులు	స్త్రీలు	తేడా
గూడూరు	95,535	97,880	2345
సూళ్లూరుపేట	99,372	1,02,801	3429
వెంకటగిరి	97,799	99,184	1385
చంద్రగిరి	1,22,161	1,29,597	7436
తిరుపతి	93,994	97559	3565
శ్రీకాళహస్తి	1,00,982	1,05,930	4948
సత్యవేడు	89,844	93,839	3,995
మొత్తం ఓట్లు	6,99,687	7,25,790	27,103

పార్లమెంట్	పురుషులు	స్త్రీలు	తేడా
సర్వేపల్లి	95,961	98,644	2,683
గూడూరు	95,535	97,880	2,345
సూళ్లూరుపేట	99,372	1,01,801	2,429
వెంకటగిరి	97,799	99,184	1,355
తిరుపతి	93,994	97,559	3,565
శ్రీకాళహస్తి	1,00,982	1,05,930	4,948
సత్యవేడు	89,844	93,839	3,995
మొత్తం ఓట్లు	6,73,487	6,94,837	17,755

ఎండను సైతం లెక్కచేయకుండా..

ఉదయం నుంచి క్యూలో నిలబడిన మహిళలు ఓటింగ్ ఆలస్యమవుతున్నా ఓపికగా వేచి ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన ఎండ కాస్తున్నా లెక్క చేయకుండా క్యూకట్టారు. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించినా పోలింగ్ కేంద్రాలను వీడేందుకు మహిళలెవరూ ఆసక్తి చూపలేదు. జగనన్నను గెలిపించాలనే గొప్ప సంకల్పం వారిలో ఎంత బలంగా నాటుకుపోయిందో స్పష్టమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

జిల్లా సమాచారం...

ఓటర్లు	18,12,980
పురుషుల ఓట్లు	8,83,330
మహిళల ఓట్లు	9,29,466
ట్రాన్స్‌జెండర్లు	184
అసెంబ్లీకి పోలైన పురుషుల ఓట్లు	6,99,687
అసెంబ్లీకి పోలైన స్త్రీల ఓట్లు	7,25,790
అసెంబ్లీకి పోలైన ట్రాన్స్ జెండర్ల ఓట్లు	63
అసెంబ్లీకి పోలైన మొత్తం ఓట్లు	14,25,540
అసెంబ్లీకి పోలైన ఓట్ల శాతం	78.63

పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఉన్న మొత్తం ఓట్లు	17,29,832
పురుషుల ఓట్లు	8,43,132
స్త్రీల ఓట్లు	8,86,552
ట్రాన్స్‌జెండర్లు	148
ఎంపీకి పోలైన పురుషుల ఓట్లు	6,73,487
ఎంపీకి పోలైన స్త్రీల ఓట్లు	6,94,837
ఎంపీ సెగ్మెంట్‌కు పోలైన ట్రాన్స్‌జెండర్ల ఓట్లు	38
పోలైన మొత్తం ఓట్లు	13,68,362

పురుషులను వెనక్కి నెట్టేసి..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి చోటా పురుష ఓటర్ల కంటే 1 నుంచి 2 శాతం అధికంగా మహిళలే ఓటు వేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో అత్యధికంగా పురుషులతో పోల్చుకుంటే మహిళలు 7236 మంది అధికంగా ఓట్లు వేశారు. ప్రతి నియోజకవర్గంలో మహిళలే అధికంగా ఓటు వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

1,10,946 మంది ఓటు వేయలేదు

- 2019 కంటే 2.61 శాతం తగ్గిన ఓటింగ్
- రాష్ట్రంలో చివరి స్థానంలో తిరుపతి
- ఫలించని అధికారుల ప్రయత్నం

తిరుపతి సిటీ: తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలోని 3,02,503మంది ఓటర్లకు గాను 1,91,557 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో అసెంబ్లీకి 63.32 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన పోలింగ్ శాతం పరిశీలిస్తే తిరుపతి చిట్టచివరి స్థానంలో నిలిచింది. తిరుపతి పట్టణంలో సుమారు 1,10,946 మంది ప్రజలు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 50.94 శాతం, 2009లో 51.6 శాతం, 2012లో జరిగిన ఉపఎన్నికల్లో 53.21 శాతం, 2014లో జరిగిన ఎన్నికలలో 59.51 శాతం నమోదు కాగా 2015లో జరిగిన ఉప ఎన్నికల్లో 50.78 శాతం, 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 65.93 శాతం పోలింగ్ నమోదైంది. 2024 ఎన్నికలలో 63.32 శాతం నమోదైంది.

తీరు మారని తిరుపతి ఓటరు

ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లాస్థాయి అధికారులు తిరుపతి అసెంబ్లీ పరిధిలో పోలింగ్ శాతం పెంచేందుకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారంతో పాటు ప్రసార సాధనాల ద్వారా ఓటరును చైతన్య పరిచారు. యువతను చైతన్య వంతులను చేసేందుకు నగరంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలను భాగస్వామ్యులను చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయినా కూడా నగర ఓటర్ల తీరు మారకపోవడం విచారకరమని అధికారులు మదనపడుతున్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నగర ప్రజలు వినియోగించుకోకపోవడం ఓటరు నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు మేధావులు సైతం అభిప్రాయపడుతున్నారు. ప్రతి సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతిలో కనీసం 70 శాతానికి ఓటింగ్ చేరకపోవడం దారుణమనేది నగ్నసత్యం.

- మహిళా ఓటింగ్ పెరగడమే నిదర్శనం
- ఓటర్లను బెదిరించడం థామస్‌కు తగదు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

సంక్షేమానికి జైకొట్టిన ఓటర్లు

పాలసముద్రం : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఓటర్లు జై కొట్టారని, ప్రత్యేకించి మహిళా ఓటింగ్ పెరగడమే దీనికి నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన రాచపాల్యంలో అనారోగ్యంతో ఉన్న చంద్రశేఖర్ రాజుని తమ పార్టీ కార్యకర్తలతో కలసి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ పర్యాయం ఎన్నికల్లో పోలింగ్‌కు మహిళ ఓటర్లు సునామీలా తరలివచ్చారని చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చేయాలని వారు బలంగా ఆకాంక్షించారని పేర్కొన్నారు. చంద్రశేఖర్ రాజు టీడీపీ జెండాను మోశారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఆయన వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం బైక్‌లో ప్రచారం చేశారని చెప్పారు. ఆయన కృషిని తానెప్పటికీ మరవనని తెలిపారు. ఇక, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ ఓటర్లను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడం ఎంతమాత్రమూ సరికాదని మండిపడ్డారు. ఎన్నికలకు థామస్ మూడు వందల మందిని రౌడీలను తీసుకొచ్చి ప్రతి గ్రామంలో అల్లకల్లోలం సృష్టించాడని, ఓటర్లను ప్రలోభాలకు గురిశాడని, రూ. 500 టోకెన్, యువకులకు మద్యం ఇచ్చి గ్రామాల్లో గొడవలు రేపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రాజకీయ చరిత్రలో ఇలాంటి నీజ రాజకీయం ఎన్నడూ చూడలేదన్నారు. ఓటర్లకు ఇవ్వడానికి థామస్ టిప్పర్‌లో మద్యం సీసాలను తీసుకొచ్చాడని, దానిని సీజ్ చేశారని చెప్పారు. అతడు దౌర్జన్యం చేస్తున్నాడని, ఓటర్లను బెదిరిస్తున్నాడని ఎస్పీలు, డీఎస్పీలకు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు.



చంద్రశేఖర్‌రాజును పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, మండల కన్వీనర్ తులసి యాదవ్, మండల రైతు భరోసా చైర్మన్ పోలయ్య, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.75,280
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,742
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.87,000
రిటైల్ వెండి గ్రాము	రూ.89.00

క్లుప్తంగా

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటేశ్వర్లు

కలువాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకోవడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. సోమశిలకు చెందిన వెంకటేశ్వర్లు(45) బుధవారం కలువాయికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా, ఉయ్యాలపల్లి నుంచి కలువాయికి వస్తున్న పామర్తి నగేష్ బైక్ బ్రాహ్మణపల్లి సమీపంలో ఇరువురి బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. గాయపడిన వీరిని స్థానికులు కలువాయి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందాడు. నగేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఫిర్యాదు

పెళ్లకూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెళ్లకూరులో చోటు చేసుకున్న ఘటనలపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన అరుణపై అదే ప్రాంతానికి చెందిన తేజ అనే యువకుడు సోమవారం దాడి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే అదే ప్రాంతానికి చెందిన అరుణ్, అర్జున్, సెల్వ, శ్రావణి, జ్యోతి, షఫ్రిన్ కలిసి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పేరం మధునాయుడు, పేరం రమేష్‌నాయుడు ప్రోద్బలంతో మాజీ గ్రామ వలంటీర్ కళత్తూరు మాలతిపై దాడి చేయించడంతో పాటు దుర్భాషలాడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై నాయుడుపేట సీఐ జగన్‌మోహన్‌రావు, ఎస్‌ఐ శ్రీకాంత్ ఇరువర్గాల ఫిర్యాదులను పరిశీలించి గర్భిణీపై దాడికి పాల్పడిన తేజపై బుధవారం కేసు నమోదు చేశారు. అలాగే టీడీపీ నాయకులు మధునాయుడు, రమేష్‌నాయుడుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



ఆర్ వెంకటమ్మ (ఫైల్)

విజయపురం : మండల కేంద్రం విజయపురానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఆర్.వెంకటమ్మ (111) బుధవారం మృతి చెందారు. ఆమె ఈ నెల 13వ తేదీ చివరిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆమెకు ఒక కుమార్తె ఉంది. ఆమె వయసు 85 సంవత్సరాలు కావడం విశేషం.

సూడో జర్నలిస్టులను ఎండగడతా

- నేను పాత్రికేయులకు మిత్రుడిని
- పాత్రికేయ వృత్తి చేసిన వాడిని
- ప్రత్యర్థులకు అమ్ముడుపోయి లేనిపోనివి రాస్తే ఊరుకోం
- మావాళ్లు వారి ఇళ్లవద్ద భయభ్రాంతులకు గురిచేస్తున్నారనడం దుర్మార్గం
- ప్రత్యర్థి నాయకులపై కూడా మేం ఎలాంటి ఘర్షణలకు పాల్పడలేదు
- మీడియాతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: జర్నలిస్టు ముసుగు వేసుకుని భూ కబ్జాలు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సూడో జర్నలిస్టులను ఎండగడుతానని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి హెచ్చరించారు. తనపై కొందరు ఎస్పీకి ఫిర్యాదు చేయడంపై ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. ''జర్నలిస్టు ముసుగులో కొందరు చేస్తున్న అక్రమాలను బయటపెట్టినందుకు మేమేదో ఉత్తమ జర్నలిస్టులపై ఆరోపణలు చేసినట్లుగా కొందరు ఇతర జర్నలిస్టులు వారికి వత్తాసు పలకడం బాధాకరం. దాంతోపాటు కొందరు పాత్రికేయుల ఇళ్ల వద్దకు మేము మావాళ్లు కొందిరిని బైక్‌లపై పంపి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఎస్పీకి ఫిర్యాదుచేసి సానుభూతి పొందాలని చూస్తున్నారు. గత ఐదేళ్లలో మా ప్రత్యర్థి నాయకులపై కూడా ఏనాడు ఎలాంటి ఘర్షణలకూ పాల్పడని నైజం మాది. మా ప్రత్యర్థులకు అమ్ముడుపోయి ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తూ కథనాలు రాయడం దుర్మార్గం. జర్నలిస్టు ముసుగు వేసుకుని అక్రమాలకు పాల్పడుతున్న వారు సమాజానికి చీడపురుగులాంటి వారు. అలాంటి సూడో జర్నలిస్టులను ఎండగడుతాం. జర్నలిస్టులంటే నాకు ఎంతో గౌరవం. నేను కూడా పాత్రికేయ వృత్తి చేసినటువంటి వాడిని. పాత్రికేయ వృత్తిలో ఎంత గొప్పగా ఉండాలో తెలుసుకున్నటువంటి వ్యక్తిగా జర్నలిస్టు పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వారి దుర్మార్గాలను ఎండగట్టకపోతే మొత్తం పాత్రికేయులందరికీ ఆ మరక అంటుకుంటుంది. వీరి అవినీతి అక్రమాలు ఎవ్వరో చెబితే చెప్పింది కాదు. వారితో కలసి పనిచేసే వారే స్వయంగా చెప్పినవి. నేను జర్నలిస్టులకు డబ్బులిచ్చి నా గురించి గొప్పగా రాయించుకునే రాజకీయ నాయకుడిని కాదు. ఉద్యమ, పోరాటాలతో రాజకీయంలోకి వచ్చిన వ్యక్తిని'' అని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తపాలా ఏజెన్సీలకు దరఖాస్తుల ఆహ్వానం

- సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ వసంత

తిరుపతి(అలిపిరి): తపాలాశాఖలో డైరెక్ట్ ఏజెన్సీలకు అర్హులైన నిరుద్యోగ యువత నుంచి ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ జేఎం వసంత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ ఇన్సూరెన్స్ సేకరణ కోసం ఏజెన్సీ నియామకాలు చేపడుతున్నామని.. పదో తరగతి పాసై ఇతర బీమా కంపెనీలలో పనిచేయకుండా, 18 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. నిరుద్యోగ యువతతోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, రిటైర్డ్ ఉద్యోగులు కూడా ఇందుకు అర్హులని తెలిపారు. ఈనెల 18వతేదీ లోపు దరఖాస్తులను తిరుపతిలోని హెడ్‌పోస్టాఫీసులో అందజేయాలని కోరారు. 22వ తేదీన ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించి డైరెక్టు ఏజెన్సీలను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులు సెక్యూరిటీ సేవింగ్స్ కింద రూ.5 వేలు నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ రూపంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి పోస్టల్ కోడ్ అందిస్తామని, ఆ కోడ్‌ను ఉపయోగించి పాలసీ సేకరణ చేయవచ్చన్నారు. సేకరించిన ప్రీమియంపైన ఆకర్షణీయమైన ఇన్సెంటివ్ అందించనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం సేకరించిన ప్రీమియంకు 4 శాతం నుంచి 20 శాతం వరకు కమీషన్, రెండో సంవత్సరం నుంచి 1 శాతం కమీషన్ అందుతుందన్నారు. రూరల్‌లో సేకరించిన ప్రీమియంకు మొదటిగా 10 శాతం, రెండో సంవత్సరం నుంచి 20 శాతం కమీషన్ అందుతుందని తెలిపారు.

సుకన్య సమృద్ధి యోజనతో భవిష్యత్

తపాలశాఖలో 2014 డిసెంబర్‌లో ప్రారంభించిన సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లల భవిష్యత్తుకు మంచి భరోసా కలిగిస్తోందని జేఎం వసంత తెలిపారు. పదేళ్లలోపు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు కేవలం రూ.250తో ఖాతాను తెరవవచ్చన్నారు. గరిష్ఠంగా ఒక ఆర్థిక సంవత్సరం(ఏప్రిల్ నుంచి మార్చి వరకు)లో రూ.1,50,000 వరకు ఈ ఖాతాలో డిపాజిట్ చేయొచ్చని.. దీనికి అత్యధికంగా 8.2 శాతం వడ్డీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 15 ఏళ్ల వరకు ఖాతాలో సొమ్ము జమ చేయాల్సి ఉంటుందని 21 ఏళ్ల తరువాత పథకం పూర్తి కాగానే సొమ్ము చెల్లించనున్నట్లు తెలిపారు. అయితే ఆడపిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం అప్పటి వరకు జమచేసిన మొత్తంలో 50 శాతం తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. సెక్షన్ 80-సీ ప్రకారం ఖాతాలోని సొమ్ము మొత్తంపై పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకంలో మహిళలు, ఆడపిల్లలు ఈ ఖాతాను రూ.1000 నుంచి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ఖాతాను ప్రారంభించవచ్చన్నారు. రెండేళ్ల తరువాత వడ్డీతో పాటు సొమ్ము చెల్లించడం జరుగుతుందన్నారు. తపాలా శాఖలోని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు సమీపంలోని తపాలా కార్యాలయాలను సంప్రదించవచ్చని కోరారు.

రఘుపతినాయుడు కుటుంబానికి అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి
- దశదిన కర్మలకు హాజరైన ప్రజాప్రతినిధులు

చౌడేపల్లె: తెలుగుదేశం పార్టీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి మృత్యువుతో ఐదురోజులు పోరాడి కన్నుమూసిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయకొండక్రాస్‌కు చెందిన రఘుపతినాయుడు కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం బోయకొండ క్రాసులో నిర్వహించిన దశదిన కర్మక్రియలకు ఆయనతోపాటు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లడ్డు రమణ, పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు హాజరయ్యారు. రఘుపతినాయుడు మృతితో పార్టీ మంచి నేతను కోల్పోయిందని, ఆయన లేని లోటును పూడ్చలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారం ఎప్పటికీ ఉంటుందని, అండదండలు ఉంటాయన్నారు. అనంతరం రఘుపతినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, నేతలు మల్లికార్జునరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రమేష్‌బాబు, చిన్నప్ప, మునికృష్ణమనాయుడు, బాబురెడ్డి, గిరిబాబు, రాజశేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రఘుపతినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

21లోపు ఇన్‌స్టంట్ పరీక్ష ఫీజు చెల్లించాలి

తిరుపతి సిటీ: ఎస్వీయూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు సంబంధించి 5వ సెమిస్టర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్వీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అన్ని కోర్సులకు సంబంధించిన 5వ సెమిస్టర్ ఫలితాలను ఈనెల 7వ తేదీన విడుదల చేయడం జరిగిందన్నారు. సబెక్ట్‌లలో తప్పిన విద్యార్థులు ఈనెల 21లోపు పరీక్ష ఫీజును చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు. ఒక్క సబెక్ట్‌లో తప్పిన విద్యార్థులు రూ.3 వేలు, రెండు సబ్జెక్ట్‌లలో తప్పిన వారు రూ.4500, మూడు సబ్జెక్టులకు గాను రూ.5వేలు, నాలుగు సబ్జెక్టులకు రూ.5,500, ఐదింటికి రూ.6 వేలు, ఆరు సబ్జెక్టులకు రూ.6500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 103210100016716కు ఆన్‌లైన్ చలానా ద్వారా మాత్రమే విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించాలని సూచించారు. వివరాలతో పాటు ఎస్వీయూ పరీక్షల విభాగంలో అందుబాటులో ఉన్న దరఖాస్తుకు జతపరిచి సిబ్బందికి అందజేయాలని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో, చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, మదనపల్లె బీటీ కళాశాలలో మాత్రమే ఇన్‌స్టంట్ పరీక్షను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి



మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



ఇండియన్ రైల్వే ట్రాఫిక్ మెంబర్ సీమకుమార్

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఇండియన్ రైల్వే ట్రాఫిక్ మెంబర్ సీమకుమార్, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

భార్య లేదన్న మనస్తాపంతో..

- ఆత్మహత్య చేసుకున్న భర్త
- అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు

వెంకటగిరిరూరల్: కుటుంబంలో తలెత్తిన చిన్నపాటి మనస్పర్థల కారణంగా క్షణికావేశంలో భార్యను చంపి జైలు పాలయ్యాడు ఓ వ్యక్తి. ఇటీవల జైలు నుంచి విడుదలైన అతనికి భార్య లేని లోటు కనిపించింది. దీంతో మనస్తాపానికి గురై అతడు కూడా ఉరేసుకుని తనువు చాలించాడు. తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన వారి పిల్లలు ఇద్దరు అనాథలుగా మారిన ఘటన వెంకటగిరి పట్టణంలోని బొగ్గుల మిట్ట ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి పట్టణం బొగ్గుల మిట్ట ప్రాంతానికి చెందిన రాయని వీరభద్రయ్య (38) బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి, గత ఆర్నెళ్ల కిందట స్వగ్రామానికి వచ్చాడు. అయితే ఇంట్లో భార్యతో అతనికి చిన్నపాటి మనస్పర్థలు రావడంతో క్షణికావేశంలో ఆమెను చంపేశాడు. ఈ కేసులో అతను జైలుకు కూడా వెళ్లాడు. గత వారం కిందట వీరభద్రయ్య జైలు నుంచి విడుదలయ్యాడు. మంగళవారం రాత్రి అతని తల్లి సుబ్బమ్మ, ఇద్దరు చిన్నారులతో బయట నిద్రిస్తుండగా వీరభద్రయ్య భార్య లేదని మనస్థాపానికి గురై ఇంటి పైకప్పునకు ఉన్న ఇనుప చువ్వకు చీరతో ఉరేసుకున్నాడు. అనుమానం వచ్చి తల్లి సుబ్బమ్మ తలుపు తట్టినా ఎంతకీ తీయకపోవడంతో కిటికీలో నుంచి చూసింది. కొడుకు వీరభద్రయ్య ఉరేసుకున్న విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్‌ఐ బీవీ రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

పెంచలకోన ఆలయానికి భారీ ఆదాయం

రాపూరు: పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీల ద్వారా ఈసారి భారీ ఆదాయం వచ్చిందని డీసీ విజయసాగర్ తెలిపారు. శ్రీవారి ఆలయ మండపంలో బుధవారం హుండీలోని కానుకలను లెక్కించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 54 రోజులకు గాను లెక్కించిన శ్రీవారి హుండీల ద్వారా రూ.53.3 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. బంగారం 230 గ్రాములు, వెండి 2.9 కేజీలు వచ్చినట్లు చెప్పారు. విదేశాలకు చెందిన కరెన్సీ నోట్లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ఏసీ వెంకటేశ్వర్లు, జిల్లా దేవదాయశాఖ సిబ్బంది, బ్యాంకు, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి గల్లంతు



సుబ్బరాయులు(ఫైల్)

చిట్టమూరు(చిల్లకూరు): స్నానం చేసేందుకు నీటి గుంతలో దిగిన ఓ వ్యక్తి గల్లంతైన సంఘటన చిట్టమూరు మండలంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని సోమసముద్రానికి చెందిన ఈదూరు సుబ్బరాయులు(39) కూలీ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో గ్రామానికి సమీపంలో ఉన్న కమాన్ గుంతలో స్నానానికి దిగాడు. అయితే ఈ గుంతలో ఇసుక ఎక్కువ ఉండడంతో అతను పైకి రాలేక గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అగ్నిమాపక సిబ్బందితో వచ్చి సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. సుబ్బరాయులుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్యబిడ్డలు అనాథలు అయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

కూచువారిపల్లి ఘటనపై కేసు నమోదు

- ఇరు పార్టీల నాయకులపై కేసు నమోదు చేసినట్లు సమాచారం
- ఇల్లు, కారు దగ్ధం చేసి, దాడికి పాల్పడిన వారిని వదిలేసి మాపై కేసులు నమోదు చేస్తారా
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి: కూచువారిపల్లిలో సోమవారం రాత్రి టీడీపీ నాయకులు చేసిన హింసాత్మక ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. పులివర్తి నాని భారీగా తన అనుచరులతో కలసి కూచువారిపల్లికి చేరుకుని వైఎస్సార్‌సీపీ నాయకులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఆపై వాహనాలకు నిప్పంటించి, సర్పంచ్ ఇల్లును సైతం కాల్చి బూడిద చేశారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పక్కా ప్రణాళికతో దాడులకు పాల్పడిన టీడీపీ నాయకులు తప్పుడు ఫిర్యాదులు ఇవ్వడంతో పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

దెబ్బలు తిని, ఆస్తులు పోగొట్టుకున్న మాపై అక్రమ కేసులు : వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉద్దేశపూర్వకంగా తమపై దాడులు చేసి, తమ వాహనాలు, ఆస్తులను ధ్వంసం చేసిన వారిని వదిలేసి పోలీసులు అక్రమంగా తమపై కేసులు బనాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల సమక్షంలో పులివర్తి నాని చిత్తూరు, తమిళనాడు నుంచి రౌడీలను తీసుకొచ్చి ఈ హింసాకాండకు పూనుకున్నారని ఆరోపిస్తున్నారు. సోమవారం రాత్రి 8 నుంచి మంగళవారం తెల్లవారుజామువరకు నానితో పాటు ఆయన అనుచరులు విధ్వంసం సృష్టించారన్నారు. నేరస్తులను వదిలేసి తమపై అక్రమంగా కేసులు నమోదు చేసి, పోలీసులు టీడీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై సీఐ రామయ్యను వివరణ కోరగా.. ఇరు పార్టీలకు చెందిన వారిపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే హింసాకాండకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

బోయకొండ కార్యాలయంలో మరమ్మతులు

- తన సొంత సొమ్ము వినియోగిస్తానన్న ఆలయ ఈఓ

చౌడేపల్లె: తన సొమ్ముతో బోయకొండ గంగమ్మ ఆలయ కార్యాలయంలో మరమ్మతులు చేయిస్తానని ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బోయకొండ కార్యాలయంలో మంగళవారం గుర్తించిన అగ్ని ప్రమాదం ప్రకృతి వైపరీత్యాల కారణంగా చోటు చేసుకుందని పేర్కొన్నారు. ఈ ఘటన తననెంతో బాధించిందని చెప్పారు. ప్రమాదంలో కంప్యూటర్లు, ఎలక్ట్రికల్ సామగ్రి, సీసీ కెమెరాలు, ఎయిర్ కూలర్ పరికరాలు, వివిధ సామగ్రి దెబ్బతిన సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు వివరించారు. తన సొంత సొమ్ముతో వీటిని పది రోజుల్లో మరమ్మతులు చేయించి కార్యాలయాన్ని పూర్వస్థితికి తెస్తామన్నారు.



ఈఓ చంద్రమౌళి

రైలు ఢీకొని యువకుడి మృతి



రైలు పట్టాల వద్ద పడి ఉన్న శెట్టి రాజేష్ మృతదేహం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. సూళ్లూరుపేట రైల్వే ఇన్‌చార్జ్ ఎస్‌ఐ కే.కొండప్పనాయుడు తెలిపిన మేరకు వివరాలిలా.. గూడూరు రూరల్ మండలం వెందోడు గ్రామానికి చెందిన శెట్టి వెంకటేశ్వర్లు, అంజనా దంపతుల కుమారుడు శెట్టి రాజేష్ ఇటీవల తెలంగాణలోని గద్వాల్ ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. రోజువారీ లాగే ఎలక్ట్రీషియన్ పనులు ముగించుకుని మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన రాజేష్ అర్ధరాత్రి 1.30 ప్రాంతంలో రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై మృతి చెంది ఉండడాన్ని రైల్వేసిబ్బంది గుర్తించి స్టేషన్ ఎస్‌ఎం లక్ష్మీనారాయణకు సమాచారం అందించారు. రైల్వే ఎస్‌ఐ కొండప్పనాయుడు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని రాజేష్ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజేష్ ప్రేమ వివాహం చేసుకుని నెల రోజులు కూడా కాలేదని భార్య, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రైల్వే ట్రాక్‌పై మృతదేహం

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్, గొల్లలమలుపు ఎల్‌సీ గేట్ మధ్యలో దిగువ రైలు మార్గంలోని 40-50 ఏళ్ల వయసు గల వ్యక్తి గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. 14వ తేదీ సాయంత్రం మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే పోలీసులు బుధవారం తెలిపారు. మృతుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆచూకీ లభించలేదని, సన్నీ చేసుకుని తెల్లని వెంట్రుకలు, గడ్డం కలిగి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు వెంటనే 9573245266 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ ఏజెంట్లుగా కూర్చున్నందుకే మాపై కేసు

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి

రామచంద్రాపురం: అనుప్పల్లి పంచాయతీలో పోలింగ్ రోజు వైఎస్సార్‌సీపీ తరపున ఏజెంట్లుగా కూర్చున్నందుకే తమపై కక్షగట్టి కేసులు పెడుతున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎస్‌ఐ చిరంజీవి, పద్మావతి మహిళా వర్సిటీ స్టేషన్ ఎస్‌ఐ రామాంజనేయులు బుధవారం మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డితోపాటు 11 మందిని ఆర్సీపురం పోలీస్ స్టేషనుకు తీసుకువచ్చి విచారించారు. ఈ సందర్భంగా ఆయ న విలేకరులతో మాట్లాడుతూ మహిళా విశ్వవిద్యా లయం వద్ద జరిగిన సంఘటనకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అయినా పోలీస్ స్టేషనుకు పిలిపించి విచారించడం ఏమిటని ప్రశ్నించారు. అనుప్పల్లిలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ వస్తుందని, దీన్ని ఓర్వలేకనే ఇలాంటి పనులకు పూనుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరాధారమైన కేసులు పెట్టడం దురదృష్టకరమన్నారు.



పోలీస్ స్టేషన్ ముందు విలేకరులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి